# భారత రాజ్యాంగం



सत्यमेव जयते



The Constitution of India

PREAMBLE

WE, THE PEOPLE OF INDIA,
having solemnly resolved to constitute India into a
SOVEREIGN SOCIALIST
SECULAR DEMOCRATIC REPUBLIC
and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;
LIBERTY of thought,
expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity;
and to promote among them all
FRATERNITY assuring the dignity of the
individual and the unity and
integrity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY
this twenty-sixth day of November, 1949, do
HEREBY ADOPT, ENACT AND GIVE TO
OURSELVES THIS CONSTITUTION.



# సూచిక


| | |
|---|---|
| 1. భారత రాజ్యాంగం – విశిష్టత | 4 |
| 2. భారత రాజ్యాంగ పరిషత్ నిర్మాణం | 7 |
| 3. రాజ్యాంగ ప్రవేశిక | 9 |
| 4. ప్రాధమిక హక్కులు | 10 |
| 5. రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు | 12 |
| 6. ప్రాధమిక విధులు | 13 |
| 7. రాష్ట్రపతి | 14 |
| 8. ఉప రాష్ట్రపతి | 16 |
| 9. ప్రధానమంత్రి – కేంద్ర మంత్రి మండలి | 17 |
| 10. రాష్ట్ర ప్రభుత్వం – గవర్నర్ | 18 |
| 11. ముఖ్యమంత్రి | 19 |
| 12. గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలు | 19 |
| 13. భారత న్యాయవ్యవస్థ – సుప్రీం కోర్టు | 21 |
| 14. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) | 25 |
| 15. రాష్ట్ర హైకోర్టు | 25 |
| 16. అత్యవసరాధికారాలు | 27 |
| 17. రాజ్యాంగబద్ధ సంస్థలు | 30 |
| 18. రాజ్యాంగ సవరణ పద్ధతి | 35 |
| 19. ముఖ్యమైన రాజ్యాంగ సవరణలు | 36 |

# భారత రాజ్యాంగం – విశిష్టత

## రాజ్యాంగం అంటే ఏమిటి ?

ఏ దేశం అయినా ప్రజలను పరిపాలించడానికి కొన్ని నియమాలు రూపొందించుకోవాలి. పరిపాలనా సౌలభ్యానికి అవసరమైన నియమాల సమాహారమే రాజ్యాంగం.

“ప్రభుత్వ స్వరూపాన్ని, అది పని చేసే విధానాన్ని తెలిపే నిర్దిష్ట నియమాల సముదాయమే రాజ్యాంగం - లార్డ్ బ్రైస్

## ముఖ్యమైన చారిత్రక అంశాలు :

బ్రిటీష్ వారు మన దేశం రాక ముందు మన దేశాన్ని అనేక మంది రాజులు పరిపాలించేవారు. బ్రిటీష్ దేశానికి చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీ, మరికొన్ని యూరప్ దేశాల వాణిజ్య సంస్థలు వ్యాపారం చేసుకోవడానికి మన దేశానికి వచ్చి, క్రమంగా అనేక రాజ్యాలను ఆక్రమించారు. ప్రధానంగా ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రజలను పరిపాలించసాగింది. వీరి పరిపాలనలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

1857లో వీరి పరిపాలనకు వ్యతిరేకంగా సిపాయిల తిరుగుబాటు జరిగింది. దీనిని ప్రధమ స్వాతంత్ర సమరంగా చెప్పవచ్చు. దీని ఫలితంగా 1858 నుండి భారత దేశ పరిపాలన పూర్తిగా బ్రిటీష్ రాణి చేతుల్లోకి వెళ్లింది. బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసి మనలను పరిపాలించేది. కానీ, పరిపాలనలో ఏమాత్రం మార్పు రాలేదు. అందువల్ల భారతీయులు స్వాతంత్రం సాధించడానికి అనేక దశలలో ఉద్యమాలు చేశారు. వాటిలో కొన్ని...

## 1. మితవాద దశ (1885-1905)

విజ్ఞప్తి, ప్రార్ధన, ప్రదర్శన అనే చట్టబద్ధమైన, శాంతియుత పద్ధతుల ద్వారా బ్రిటీష్ పాలకులను ప్రసన్నం చేసుకుని తమ కోర్కెలను సాధించడానికి ప్రయత్నించారు.

## 2. అతివాద దశ (1905-1920) :

బ్రిటీష్ ప్రభుత్వ ఆర్ధిక విధానాలు భారత దేశాన్ని పూర్తిగా దోపిడీ చేసే విధంగా తయారయ్యాయి. అంతేగాక 1905లో బెంగాల్ ను మతం ఆధారంగా తూర్పు , పశ్చిమ బెంగాల్ లుగా విభజించారు. దీంతో అతివాదులుగా పేరొందిన బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ వంటి వారు వందేమాతర ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో భాగంగా స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయ విద్యా వ్యాప్తి మొదలైనవి నిర్వహించారు. 1916లో తిలక్, లజపతిరాయ్, అనీబిసెంట్ వంటివారు హోం రూల్ ఉద్యమం ప్రారంభించారు.

బ్రిటీష్ వారు హిందువులు , ముస్లింల మధ్య విభేదాలు సృష్టించడానికి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా 1906లో ముస్లిం లీగ్ అనే పార్టీని స్థాపించడానికి కారకులయ్యారు. ఈ ఆలోచన చివరికి భారత దేశం రెండు దేశాలుగా విడిపోవడానికి ఒక కారణం అయ్యింది.

## 3. గాంధీ యుగం (1920-1947) :

తిలక్, లజపతిరాయ్ వంటి నాయకులు మరణించాక జాతీయోద్యమానికి మహాత్మా గాంధీ నాయకత్వం వహించారు. గాంధీగారి నేతృత్వంలో అనేక ఉద్యమాలు జరిగాయి.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్తువులను బహిష్కరిచడం , బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన బిరుదులను వెనక్కి ఇచ్చివేయడం, జాతీయ విద్యను ప్రోత్సహించడానికి కళాశాలలు, విద్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

దీని ఫలితంగా స్వపరిపాలనకు భారత దేశం ఏ మేరకు సిద్ధంగా ఉందో తెలుసుకోవడానికి బ్రిటీష్ ప్రభుత్వం 1927లో సైమన్ కమిషన్ వేసింది. కానీ ఈ కమిషన్ లో ఒక్క భారతీయుడు కూడా లేకపోవడంతో మన నాయకులు దీనిని తిరస్కరించారు.

1930, జనవరి 26వ తేదీన జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మన నాయకులు ఆ రోజుని స్వరాజ్య దినంగా ప్రకటించారు. బ్రిటీష్ ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో గాంధీజీ శాసనోల్లంఘున ఉద్యమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా సుశిక్షితులైన 79 మంది స్వచ్ఛంద సేవకులతో గుజరాత్ లోని సబర్మతీ ఆశ్రమం నుంచి 12-03-1930 తేదీన బయలుదేరి పాదయాత్ర గా 24 రోజుల్లో 241 మైళ్ళు ప్రయాణించి 6-4-1930 న దండి చేరుకున్నారు. అక్కడ ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు. దీనిని ఉప్పు సత్యాగ్రహం లేదా దండి సత్యాగ్రహం అంటారు.

ఈ ఉద్యమ ఫలితంగా 1931లో మహాత్మా గాంధీ, వైస్రాయ్ ఇర్విన్ మధ్య ఇర్విన్ ఒడంబడిక జరిగింది. బ్రిటీష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించింది. మొదటి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హాజరు కాకపోవడంతో అర్ధాంతరంగా ముగిసింది. రెండవ సమావేశంలో గాంధీ హాజరైనప్పటికీ గాంధీ, జిన్నా మధ్య అంగీకారం కుదరక పోవడంతో సమావేశం విఫలమైంది.

ఇంతలో బ్రిటీష్ ప్రభుత్వం 1932 ఆగస్టు 4వ తేదీన కమ్యూనల్ అవార్డు ప్రకటించింది. ఈ అవార్డు ద్వారా అల్ప సంఖ్యాకులకు, నిమ్న జాతులకు, ఇండియన్ క్రైస్తవులకు, ఆంగ్లో ఇండియన్లకు, ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు కేటాయిస్తున్నట్టు ప్రకటిచింది. దీనిని

వ్యతిరేకిస్తూ 1932, సెప్టెంబర్ లో గాంధీజీ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, గాంధీల మధ్య పూనా ఒప్పందం కుదిరింది.

మూడవ రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ పార్టీని ఆహ్వానించలేదు. అందువల్ల ఈ సమావేశం ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసింది.

చివరిగా బ్రిటీష్ ప్రభుత్వం భారతీయులను సంప్రదించకుండా భారత దేశం రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొంటుందని ప్రకటించింది. దీనితో గాంధీ 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమ సందర్భంగా గాంధీ " DO or DIE" నినాదం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం చాలా మంది నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపించింది. కానీ ప్రజలు పెద్ద యెత్తున ఉద్యమాన్ని నడిపారు. ఈ ఉద్యమాల ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వం 'భారత స్వాతంత్ర చట్టం 1947' ఆధారంగా ఇండియా, పాకిస్తాన్ అనే రెండు దేశాలు ఏర్పాటు చేసి స్వాతంత్రం ప్రకటించింది.

## భారత రాజ్యాంగ పరిషత్ నిర్మాణం

భారత రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ పరిషత్ రూపొందించింది. భారత రాజ్యాంగ పరిషత్ 1946లో ఎన్నికల తరవాత ఏర్పడింది. ఈ ఎన్నికలలో బ్రిటీష్ ఇండియా గవర్నర్ పాలిత రాష్ట్రాల నుంచి 290 మంది సభ్యులు ఎన్నికకాగా స్వదేశీ సంస్థానాల నుంచి 70 మంది సభ్యులు నియమించబడ్డారు. కాంగ్రెస్ 202 స్థానాలు, ముస్లిం లీగ్ 73 స్థానాలు, మిగిలినవి ఇతరులు గెల్చుకున్నారు.

భారత రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబర్ 9న జరిగింది. రాజ్యాంగ పరిషత్ 12 ఉప సంఘాలుగా పని చేయడం ప్రారంభించింది. రాజ్యాంగాన్ని రచించడానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యతన రాజ్యాంగ రచనా కమిటీ (ముసాయిదా కమిటీ) ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో సభ్యులు :

1. డాక్టర్ . బి.ఆర్.అంబేద్కర్ (అధ్యక్షుడు)
2. సర్ అల్లాది కృష్ణ స్వామి అయ్యర్
3. ఎస్. గోపాల స్వామి అయ్యంగార్
4. సయ్యద్ మహ్మద్ సాదుల్లా
5. డాక్టర్ కె. ఎం. మున్షీ
6. బి.ఎల్.మిత్తల్ (కొంతకాలం తర్వాత వారి స్థానంలో శ్రీ వి. మాధవరావుని నియమించారు)
7. డి.పి.ఖైతాన్ (1948లో ఆయన మరణానంతరం టి.టి.కృష్ణమాచారిని నియమించారు)

డిసెంబర్ 9, 1946 నుండి నవంబర్ 26, 1949 మధ్య రాజ్యాంగ పరిషత్ 11 సార్లు సమావేశమై 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల వ్యవధిలో రాజ్యాంగ రచనను పూర్తి చేశారు. 1950 జనవరి 26 నుండి మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

రాజ్యాంగం ఆరంభంలో 395 ప్రకరణలు, 22 భాగాలు, 8 షెడ్యూళ్ళు గా నిర్మించబడింది. ప్రస్తుతం రాజ్యాంగంలో సుమారు 465 ప్రకరణలు, 25 భాగాలు, 12 షెడ్యూళ్ళు ఉన్నాయి.

అంబేద్కర్ మరియు ఇతర సభ్యులు అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి మన దేశ భౌగోళిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా మన రాజ్యాంగాన్ని రచించడం జరిగింది.

| క్ర.సం | దేశం – రాజ్యాంగం | గ్రహించబడిన అంశాలు |
|---|---|---|
| 1. | అమెరికా రాజ్యాంగం | ప్రాథమిక హక్కులు , న్యాయ వ్యవస్థ స్వతంత్రత , న్యాయ సమీక్ష అధికారం , రాష్ట్ర పతి అభిశంసన |
| 2. | బ్రిటీష్ రాజ్యాంగం | క్యాబినెట్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ , సమ న్యాయ పాలన , పార్లమెంటరీ ప్రక్రియలు , బిల్లుల ఆమోద విధానం , స్పీకర్ హోదా , విధులు |
| 3. | కెనడా రాజ్యాంగం | అవశిష్ట అధికారాలు , అధికారాల విభజన , సమాఖ్య వ్యవస్థ |
| 4. | ఐరిష్ రాజ్యాంగం | ఆదేశిక సూత్రాలు , రాజ్యసభకు సభ్యులను నామినేట్ చేసే విధానం , రాష్ట్ర పతి ఎన్నిక విధానం |
| 5. | దక్షిణాఫ్రికా రాజ్యాంగం | రాజ్యాంగ సవరణ విధానం , రాజ్యసభ సభ్యుల ఎన్నిక విధానం |
| 6. | జర్మనీ రాజ్యాంగం | అత్యవసర పరిస్థితులలో ప్రాథమిక హక్కుల రద్దు |
| 7. | ఆస్ట్రేలియా రాజ్యాంగం | ఉమ్మడి జాబితా , పార్లమెంట్ ఉభయ సభల ఉమ్మడి సమావేశం |
| 8. | జపాన్ రాజ్యాంగం | చట్టం నిర్దేశించిన పద్ధతి |
| 9. | ఫ్రెంచ్ రాజ్యాంగం | గణతంత్రం , రాజ్యాంగ ప్రవేశిక లో స్వేచ్ఛ , సమానత్వం , సౌభ్రాతృత్వం అను ఆదర్శాలు |
| 10. | రష్యా రాజ్యాంగం | ప్రాథమిక విధులు |
| 11. | భారత ప్రభుత్వ చట్టం 1935 | సమాఖ్య నిర్మాణం , గవర్నర్ పదవి , న్యాయ శాఖ , పబ్లిక్ సర్వీస్ కమీషన్లు , అత్యవసర అధికారాలు , పరిపాలన విషయాలు |

# రాజ్యాంగ ప్రవేశిక (Preamble)

భారతప్రజలమైన మేము, భారతదేశాన్ని **సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర** రాజ్యంగా నిర్మించుకోవడానికి;

పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ **న్యాయాన్ని**;

ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో **స్వాతంత్ర్యాన్ని**;

అంతస్తుల్లోనూ, అవకాశాల్లోను **సమానత్వాన్ని** చేకూర్చుడానికి;

వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ **సౌభ్రాతృత్వాన్ని** పెంపొందించడానికి

మన ఈ రాజ్యాంగ పరిషత్ లో 1949 నవంబర్ 26న ఎంపిక చేసుకుని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

# ప్రాధమిక హక్కులు (Fundamental Rights)

భారత రాజ్యాంగం లో మూడవ భాగం లో 12 నుండి 35 ప్రకరణలలో ప్రాధమిక హక్కులు ఉన్నాయి. మౌలిక రాజ్యాంగం ఏడు ప్రాధమిక హక్కులను ప్రసాదించింది.

1. సమానత్వపు హక్కు (14-18 ప్రకరణలు)
2. స్వేచ్ఛా హక్కు (19-22 ప్రకరణలు)
3. పీడన నిరోధక హక్కు (23-24 ప్రకరణలు)
4. మత స్వాతంత్రపు హక్కు (25-28 ప్రకరణలు)
5. సాంస్కృతిక , విద్యా హక్కు (29-30 ప్రకరణలు)
6. ఆస్తి హక్కు (31వ  ప్రకరణ)
7. రాజ్యాంగ పరిహార హక్కు (32వ ప్రకరణ)

ఆస్తి హక్కుని 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978 ద్వారా ప్రాధమిక హక్కుల నుండి తొలగించి 300-Aలో చట్టబద్ధమైన హక్కుగా ఏర్పాటు చేశారు. అందువల్ల ప్రస్తుతం 6 ప్రాధమిక హక్కులు ఉన్నాయి.

## 1. సమానత్వపు హక్కు :

a. చట్టం ముందు సమానత్వం, చట్టం వల్ల సమాన రక్షణ (14వ ప్రకరణ)
b. కులం, మతం, జాతి, లింగం, జన్మ కారణంగా విచక్షణ లేకపోవడం (15వ ప్రకరణ)
c. ప్రభుత్వ ఉద్యోగాలలో సమాన అవకాశాలు (16వ ప్రకరణ)
d. అంటరాని తనం (అస్పృశ్యత) రద్దు, దానిని ఏ విధంగాను  పాటించరాదు (17వ ప్రకరణ)
e. సైనిక, విద్యాపరమైన యోగ్యతల మినహాయించి, అన్ని బిరుదులు రద్దు (18వ ప్రకరణ)

## 2. స్వేచ్ఛా హక్కు :

a. స్వేచ్ఛకు సంబంధించిన ఆరు హక్కుల రక్షణ (19వ ప్రకరణ)

i) వాక్ స్వాతంత్రం, భావ వ్యక్తీకరణ

ii) సమావేశం

iii) సంస్థలు

iv) సంచారం

v) నివాసం

vi) వృత్తి

b. నేర స్థాపన విషయంలో వ్యక్తులకు వారు చేసిన నేరాల కన్నా శిక్ష ఎక్కువ లేకుండా రక్షణ (20వ ప్రకరణ)

c. ప్రాణ రక్షణకు, ఆంతరంగిక స్వేచ్ఛకు రక్షణ (21వ ప్రకరణ)

d. ప్రాధమిక విద్యను పొందే హక్కు (21Aవ ప్రకరణ) (దీనిని 86 వ రాజ్యాంగ సవరణ చట్టం ,2002 ద్వారా చేర్చారు)

e. కొన్ని వివాదాల్లో అరెస్టు నుంచి, నిర్బంధం నుంచి రక్షణ (22వ ప్రకరణ)

## 3. పీడన నిరోధక హక్కు :

a. మనుష్యులతో వ్యాపారం, బలవంతపు చాకిరీ నిషేధం (23వ ప్రకరణ)

b. ఫ్యాక్టరీ, గనులు వంటి ప్రమాదకర ఉద్యోగాలలో చిన్న పిల్లల నియామకం నిషేధం (24వ ప్రకరణ)

## 4. మత స్వాతంత్రపు హక్కు :

a. అంతరాత్మని అనుసరించి స్వేచ్ఛగా మతాన్ని అవలంభించడానికి, ప్రచారం

చేసుకోవడానికి  స్వేచ్ఛ (25వ ప్రకరణ)

b. మత వ్యవహారాలు నిర్వహించుకునే స్వేచ్ఛ (26వ ప్రకరణ)

c. మత వ్యాప్తి కోసం పన్నులు కట్టడంలో స్వేచ్ఛ (27వ ప్రకరణ)

d. విద్యా సంస్థలలో మత బోధన, ఆరాధన విషయాల గురించి స్వేచ్ఛ (28వ ప్రకరణ)

5. సాంస్కృతిక, విద్యా హక్కులు :

a. అల్ప సంఖ్యాక వర్గాల వారి భాష, లిపి, సంస్కృతి రక్షణ (29 వ ప్రకరణ)

b. విద్యా సంస్థలు నెలకొల్పడానికి, నిర్వహించుకోవడానికి అల్ప సంఖ్యాక వర్గీయుల హక్కు (30 వ ప్రకరణ)

6. రాజ్యాంగ పరిహార హక్కు (32వ ప్రకరణ) :

a. ప్రాథమిక హక్కుల రక్షణకు, అమలు పరచడానికి సముచితమైన ఉత్తర్వులు

i) హెబియస్ కార్పస్

ii) మాండమస్

iii) ప్రొహిబిషన్

iv) సెర్షియోరారి

v) కోవారంటో

# రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు

# (Directive Principles of State Policy)

రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు రాజ్యాంగంలో నాల్గవ భాగంలో 36 నుండి 51 ప్రకరణలో పొందుపరిచి ఉన్నాయి. ఈ సూత్రాల భావాన్ని రాజ్యాంగ నిర్మాతలు 1937 నాటి ఐరిష్ రాజ్యాంగం నుండి గ్రహించారు.

| ప్రకరణ సంఖ్య | విషయం |
|---|---|
| 36 | రాజ్యం యొక్క నిర్వచనం |
| 37 | నిర్దేశిక నియమాలకు న్యాయ రక్షణ లభించదు. కానీ, ప్రభుత్వ నిర్వహణ లో వాటికి ప్రాముఖ్యత ఉంటుంది. |
| 38 | ప్రభుత్వాలు సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలి. |
| 39 | బాల బాలికలు, యువతీ యువకుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, సాంఘిక నేరాలకు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలి. |
| 39A | సమాన న్యాయం మరియు ఉచిత న్యాయ సహాయం |
| 40 | గ్రామ పంచాయితీలు ఏర్పాటు చేయడం |
| 41 | నిరుద్యోగులకు, వృద్ధులకు, వికలాంగులకు జీవన భృతిని కల్పించాలి. శక్తి, సామర్థ్యాలున్న వారందరికీ ఉపాధిని చూపాలి. |
| 42 | పని విషయంలో న్యాయ పరంగా మానవోచిత పరిస్థితులను కల్పించటం. ప్రసూతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. |
| 43 | గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలను నెలకొల్పాలి. |
| 43A | కార్మికుల సంపూర్ణ, మానసిక, శారీరక వికాసానికి శ్రద్ధ వహించాలి. |
| 43B | సహకార సంఘాలను ప్రోత్సహిచడం. |
| 44 | దేశంలో నివసించే పౌరులందరికీ వర్తించే విధంగా ఉమ్మడి పౌర స్మృతిని రూపొందించాలి. |

| | |
|---|---|
| 45 | ఆరు సంవత్సరముల లోపు బాల బాలికలకు బాల్య విద్యాభ్యాసం అందించాలి. |
| 46 | బలహీన వర్గాల ప్రజల విద్యా, సామాజిక అభివృద్ధికి శ్రద్ధ చూపాలి. |
| 47 | మత్తు పదార్థాల హాని నుంచి ప్రజలను కాపాడాలి. |
| 48 | వ్యవసాయం, పాడి పరిశ్రమలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, పశువులు,గోవులు,ఇతర పెంపుడు జంతువుల వధను నిషేధించాలి. |
| 48A | పరిసరాల పరి రక్షణ, అడవులను, అడవి జంతువులను సంరక్షించడానికి ప్రభుత్వం తగు నిర్ణయాలను తీసుకోవాలి. |
| 49 | చారిత్రక, జాతీయ ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలను, కట్టడాలను సంరక్షించాలి. |
| 50 | న్యాయ వ్యవస్థను, కార్య నిర్వాహక వ్యవస్థను వేరు చేయడం. |
| 51 | అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించటం. |

# ప్రాధమిక విధులు (Fundamental Duties)

1976 లో స్వరణ్ సింగ్ కమిటీ సూచనల మేరకు 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 10 ప్రాధమిక విధులను నాల్గవ భాగంలో 51-A ప్రకరణ ద్వారా చేర్చారు. 2002 లో 86 వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని చేర్చడం జరిగింది. ప్రస్తుతం 11 ప్రాధమిక విధులున్నాయి.

a) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం.

b) జాతీయ స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో గల ఉన్నత ఆదర్శాలను పాటించడం.

c) భారత దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించడం.

d) ఎప్పుడు పిలిచినా దేశ రక్షణకు, జాతీయ సేవకు ముందుకు రావడం.

e) భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించడం. స్త్రీల గౌరవాన్ని భంగపరిచే ఆచారాన్ని త్యజించడం.

f) మన మిశ్రమ సంస్కృతిని, ఔన్నత్యమైన సంప్రదాయాన్ని గౌరవించి పరిరక్షించడం.

g) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులతో సహా ప్రకృతి లోని పరిసరాలను కాపాడటం, అభివృద్ధి చేయడం, జీవుల పట్ల కారుణ్యం ఉండటం.

h) వైజ్ఞానిక దృక్పధాన్ని మానవ జిజ్ఞాసను, పరిశోధనా, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవడం.

i) ప్రజల ఆస్తిని సంరక్షించడం, హింసను విసర్జించడం.

j) తమ వ్యక్తిగత సమిష్టి చర్యల ద్వారా ప్రతీ కార్య రంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయడం తద్వారా దేశం అత్యున్నత శిఖరాలను అధిరోహించడం.

k) ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల లోపు తమ శిశువుకు విద్యావకాశాలను ఇచ్చే బాధ్యతను తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు కలిగి ఉండటం.

# కేంద్ర ప్రభుత్వం (5వ భాగం, 52-78 ప్రకరణలు)

కేంద్ర కార్య నిర్వాహక వర్గంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, మంత్రి మండలి, భారత అటార్నీ జనరల్ ఉంటారు.

## రాష్ట్రపతి : భారత దేశాధినేత

**అర్హతలు :**

1. భారత దేశ పౌరుడై ఉండాలి.
2. 35 సంవత్సరాలు నిండి ఉండాలి.
3. ఆదాయం వచ్చే ఏ ప్రభుత్వ పదవిలో ఉండరాదు.
4. శారీరకంగా, మానసికంగా,ఆరోగ్యవంతుడై ఉండాలి.
5. నేరారోపణ రుజువై ఉండరాదు.
6. దివాళా తీసి ఉండరాదు.

**అధికారాలు, విధులు**

1. కార్యనిర్వహణాధికారాలు :

ప్రధాన మంత్రి, మంత్రి మండలి, సుప్రీం కోర్ట్ , హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తులను, ఇతర న్యాయమూర్తులను, అటార్నీ జనరల్ ను, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ను (కాగ్), యు పి ఎస్ సి ఛైర్మన్ మరియు సభ్యులు, గవర్నర్, ప్రధాన ఎన్నికల కమీషనర్ లను నియమించడం.

2. శాసనాధికారాలు :

a) పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడం.

b) ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడం.

c) రాజ్యసభకు 12 మంది నిష్ణాతులను నామినేట్ చేయడం.

d) పార్లమెంట్ ఆమోదించిన బిల్లులను చట్టాలు కావడానికి ఆమోదం తెలపడం.

e) పార్లమెంట్ సమావేశంలో లేనపుడు ఆర్డినెన్స్ లు జారీ చేయడం.

3. ఆర్థిక అధికారాలు :

a) ద్రవ్య బిల్లులకు పూర్వానుమతి ఇవ్వడం.

b) 5 సంవత్సరాలకు ఒకసారి ఆర్థిక సంఘం ఏర్పాటు చేయడం.

c) భారత ఆగంతుక నిధి నిర్వహణ.

4. న్యాయాధికారాలు :

క్షమా బిక్ష ( pardon), శిక్షను తగ్గించడం (remission), శిక్షలను మార్పు చేయడం (reprieve), శిక్ష నుండి తాత్కాలిక ఉపశమనం (respite)

5. సైనికాధికారాలు :

a) భారత ప్రభుత్వ సర్వ సైన్యాధిపతి, త్రివిధ దళాలకు అధిపతి.

b) యుద్ధం ప్రకటించడం, సంధి షరతులు చేసుకోవడం.

6. దౌత్యాధికార విధులు :

a) అంతర్జాతీయ వ్యవహారాలకు ప్రతినిధి.

b) మిత్ర దేశాలకు రాయబారులను నియమించడం.

c) ఐక్య రాజ్య సమితికి భారతదేశ ప్రతినిధులను నియమించడం.

7. అత్యవసరాధికారాలు :

a) జాతీయ అత్యవసర పరిస్థితి (352వ ప్రకరణ)

b) రాష్ట్రపతి పాలన (356వ ప్రకరణ)

c) ఆర్థిక అత్యవసర పరిస్థితి (360వ ప్రకరణ)

8. వీటో అధికారం :

i) రాష్ట్రపతి బిల్లును ఆమోదించవచ్చు,

ii) ఆమోదాన్ని నిరాకరించవచ్చు,

iii) ద్రవ్యబిల్లు తప్ప మిగతా బిల్లులను పునః పరిశీలనకు పంపవచ్చు,

iv) బిల్లుపై మౌనం వహించవచ్చు.

## ఉప రాష్ట్రపతి

5 వ భాగంలో 63 నుండి 69 వరకు గల ప్రకరణలలో ఉప రాష్ట్రపతి గురించి ఉంది.

**అర్హతలు:**

భారతీయ పౌరుడై ఉండాలి, 35 సంవత్సరాలు నిండి ఉండాలి, రాజ్యసభ సభ్యుడిగా కావలసిన ఇతర అర్హతలు ఉండాలి.

**అధికారాలు :**

1.రాజ్య సభకు హోదారీత్యా అధ్యక్షుడు (89వ ప్రకరణ)

2. తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరిచడం (65వ ప్రకరణ)

భారత రత్న, పద్మ అవార్డుల కమిటీకి అధ్యక్షుడిగా, కొన్ని విశ్వవిద్యాలయాలకు ఛాన్స్ లర్ గా రాజ్యాంగేతర విధులను కూడా నిర్వహిస్తారు.

# ప్రధాన మంత్రి – కేంద్ర మంత్రి మండలి

# 5వ భాగం లో 74,75,78 ప్రకరణలు

## నియామకం :

75(1) – ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తాడు. ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులు రాష్ట్రపతి చేత నియమించబడతారు.
75(2) – ప్రధాన మంత్రి, మంత్రి మండలి రాష్ట్ర పతి విశ్వాసం ఉన్నంతవరకు పదవిలో కొనసాగుతారు.
75(3) – మంత్రులు సంయుక్తంగా లోక్ సభ కు భాధ్యత వహిస్తారు.

## ప్రధాన మంత్రి అధికారాలు – విధులు :

1. లోక్ సభకు నాయకుడు.
2. మంత్రి మండలి ఎంపిక, మార్పులు, చేర్పులు ప్రధాని ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుంది.
3. రాష్ట్రపతికి, మంత్రి మండలికి అనుసంధానకర్త గా వ్యవహరిస్తారు.
4. ప్రధాని సలహా మేరకే రాష్ట్రపతి లోక్ సభ ను రద్దు చేస్తారు.

## క్యాబినెట్ ప్రాముఖ్యత:

దేశంలో అత్యున్నతమైన నిర్ణాయక మండలి. కేంద్ర ప్రభుత్వంలో అన్నీ నియామకాలు, పధకాలు క్యాబినెట్ నిర్ణయం ప్రకారమే జరుగుతాయి. పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టి వాటిని ఆమోదించే విధంగా చర్యలు తీసుకుంటుంది.

# రాష్ట్ర ప్రభుత్వం – గవర్నర్, ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి
# 6వ భాగం 152-213 ప్రకరణలు

## రాష్ట్ర గవర్నర్

**అర్హతలు :**

1.భారత దేశ పౌరుడై ఉండాలి.

2. 35 సంవత్సరాలు నిండి ఉండాలి.

3. ఆదాయం వచ్చే ఏ ప్రభుత్వ పదవిలో ఉండరాదు.

4. శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యవంతుడై ఉండాలి.

5. నేరారోపణ రుజువై ఉండరాదు.

**అధికారాలు – విధులు :**

1. కార్యనిర్వహణాధికారాలు : ముఖ్య మంత్రి, మంత్రి మండలి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్ మరియు సభ్యులు, రాష్ట్ర విశ్వ విద్యాలయాలకు వైస్ ఛాన్స్ లర్ ను నియమిస్తారు.

2. శాసనాధికారాలు :

1. శాసన సభను సమావేశ పరచడం, వాయిదా వేయడం, రద్దు చేయడం.
2. ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం.
3. విధాన పరిషత్ కు 1/6 వంతు సభ్యులను నామినేట్ చేయడం.
4. ఆర్డినెన్స్ జారీ చేయడం.
5. శాసన సభ ఆమోదించిన బిల్లులను సంతకం చేయడం, పునః పరిశీలనకు పంపడం లేదా తిరస్కరించడం.

3. ఆర్థికాధికారాలు :

1. ప్రతీ ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ ను సభలో సమర్పించే విధంగా చర్యలు తీసుకుంటారు.
2. ద్రవ్య బిల్లును గవర్నర్ అనుమతితోనే విధాన సభలో ప్రవేశ పెట్టాలి.
3. రాష్ట్ర పబ్లిక్ నిధిని, ఆగంతుక నిధిని నిర్వహిస్తారు.

4. న్యాయాధికారాలు :

న్యాయ స్థానాలు విధించిన శిక్షలను, తగ్గించవచ్చు లేదా మార్పు చేయవచ్చు. రద్దు చేయవచ్చు, శిక్ష అమలును వాయిదా వేయవచ్చు, క్షమా బిక్ష కూడా పెట్టవచ్చు, అయితే ఉరిశిక్షను రద్దు చేసే అధికారం లేదు.

## ముఖ్య మంత్రి

164(1) ప్రకారం మెజారిటీ పార్టీ నాయకుణ్ణి గవర్నర్ ముఖ్యమంత్రిగా నియమిస్తారు.

అధికారాలు – విధులు :

1. రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి.
2. ముఖ్య మంత్రి సలహా పై గవర్నర్ ఇతర మంత్రులను నియమిస్తారు.
3. గవర్నర్ కు , మంత్రి మండలి కి మధ్య అనుసంధాన కర్త.
4. గవర్నర్ చేసే అనేక నియామకాలు ముఖ్యమంత్రి సలహా తోనే జరుగుతాయి.

# గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలు

# గ్రామీణ స్థానిక పాలన

## చారిత్రక నేపధ్యం :

కౌటిల్యుడు తన అర్ధశాస్త్రంలో గ్రామిక, గ్రామ కూటక అనే గ్రామాధికారుల గురించి ప్రస్తావించాడు. గ్రామాధికారిని గ్రామణి అని, 10 గ్రామాలకు అధిపతిని దశ గ్రామణి అని పిలిచేవారు. చోళుల కాలంలో స్థానిక స్వయం పరిపాలన చేసినట్లు శాసనాలు ఉన్నాయి.

ఆధునిక కాలంలో బ్రిటిష్ వారు వారన్ హేస్టింగ్స్ లో కలక్టర్ అనే పదవిని 1772 ఈస్ట్ ఇండియా కంపెనీ .ప్రవేశపెట్టారుతొలిసారిగా స్థానిక స్వపరిపాలన ఏర్పాటు చేసింది . 1870లో లార్డ్ మే"యో స్థానిక "ప్రభుత్వాల ఏర్పాటు గురించి తీర్మానం చేశాడు .1882లో లార్డ్ "రిప్పన్"స్థానిక స్వరిపాలన ప్రభుత్వాలకై తీర్మానాలు చేసి స్థానిక ప్రభుత్వాల పితామహుడిగా పేరొందాడు .

## పంచాయతీ వ్యవస్థ – పరిణామం :

అనేక కమిటీల సిఫారసుల తరువాత ప్రస్తుత పంచాయతీ వ్యవస్థ రూపు దిద్దుకుంది. 1957 జనవరిలో ఏర్పాటు చేసిన బల్వంతారాయ్ మెహతా కమిటీ మూడంచెల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసింది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, మండల స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పాటు చేయాలని సూచించింది.

1977 డిసెంబర్ లో జనతా ప్రభుత్వం అశోక్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ రెండంచెల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసింది.

1986లో ప్రధాని రాజీవ్ గాంధీ పంచాయతీలను బలోపేతం చేయడానికి ఎల్.ఎం.సింఘ్వి అధ్యక్షతన కమిటీ నియమించారు. ఈ కమిటీ సిఫారసుల మేరకు 64వ సవరణ బిల్లు 1989లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెట్టింది. రాజ్య సభలో తిరస్కరించడం వల్ల

వీగిపోయింది. 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ, ప్రభుత్వం రద్దు కావడం వల్ల బిల్లు రద్దయింది.

1992లో పి. వి. నరసింహారావు ప్రధానిగా ఉండగా 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఇది 1993 ఏప్రిల్ 24వ తేదీ నుండి అమలు లోకి వచ్చింది. 9వ భాగంలో 243(A) నుండి 243(O) వరకు పొందుపరిచి పంచాయతీలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడం జరిగింది. 11వ షెడ్యూల్ లో పంచాయతీలు నిర్వర్తించవలసిన 29 విధులను పొందుపరిచారు.

ప్రస్తుతం ఈ చట్టం ప్రకారం ప్రతీ 5 సంవత్సరాలకు ఒకసారి గ్రామ సర్పంచ్ మరియు ఇతర వార్డ్ సభ్యులను ఎన్నుకుంటారు. పోటీ చేయడానికి 21 సంవత్సరాలు నిండితే చాలు.

## పట్టణ, నగర పాలక ప్రభుత్వాలు

### చారిత్రక నేపథ్యం:

1687లో మద్రాస్ లో బ్రిటీష్ వారు మున్సిపల్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారు. 1726లో బొంబాయి, కలకత్తా కార్పొరేషన్ లు ఏర్పడ్డాయి. 1882లో లార్డ్ రిప్పన్ చేసిన తీర్మానం, 1907లో రాయల్ కమీషన్, 1919, 1935 చట్టాలు పట్టణ స్థానిక ప్రభుత్వాల ఆవశ్యకతను తెలియచేశాయి.

### 74 వ రాజ్యాంగ సవరణ :

1992లో 74వ సవరణ ద్వారా పట్టణ స్థానిక ప్రబుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. ఇది 1993 జున్ 1 వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. 9A భాగంలో 243 P – 243 ZG మరియు 12వ షెడ్యూల్ 18 రకాల అధికార విధులు పొందుపరచబడ్డాయి.

# భారత న్యాయ వ్యవస్థ

# సుప్రీం కోర్టు (6వ భాగం 124-147 అధికరణలు)

భారత న్యాయవ్యవస్థ ఏకీకృత, సమగ్ర, స్వతంత్ర పతిపత్తిగల సర్వోన్నత న్యాయ వ్యవస్థ. దేశంలోని న్యాయ స్థానాలన్నీ సుప్రీం కోర్టు పర్యవేక్షణలో పని చేస్తాయి.

## నిర్మాణం :

1950 జనవరి 28వ తేదీ నుండి సుప్రీం కోర్టు అమల్లోకి వచ్చింది. 124వ ప్రకరణ ప్రకారం ఒక ప్రధాన న్యాయమూర్తి మరియు పార్లమెంట్ నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. ప్రస్తుతం 1+33.

## న్యాయమూర్తుల నియామకం :

124(2) ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. ఇతర న్యాయమూర్తులను నియమించే సమయంలో ప్రధాన న్యాయమూర్తి మరియు ఇతర న్యాయమూర్తులను (కొలీజియం) సంప్రదిస్తారు.

## అర్హతలు - 124(3):

1. భారతీయ పౌరుడై ఉండాలి.
2. 65 సంవత్సరాలు నిండి ఉండరాదు.
3. ఏదైనా హైకోర్టు లో న్యాయమూర్తిగా 5 సంవత్సరాలు అనుభవం లేదా ఏదైనా హైకోర్టు లో 10 సంవత్సరాలు న్యాయవాదిగా పని చేసి ఉండాలి.
4. రాష్ట్రపతి దృష్టిలో న్యాయ శాస్త్రంలో నిష్ణాతుడై ఉండాలి.

తొలగింపు - 124(4):

అసమర్ధత, అక్రమ ప్రవర్తన కారణంగా సుప్రీంకోర్టు జడ్జీలను తొలగించే విధానాన్ని అభిశంసన పద్ధతి అంటారు. తొలగించే తీర్మానాన్ని ఉభయసభలలో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. అయితే క్రింది నియమాలు పాటించాలి.

1. లోక్ సభలో అయితే తొలగించే తీర్మాన నోటీస్ పై 100 మంది సభ్యులు, అదే రాజ్యసభలో అయితే 50 మంది సంతకాలు చేసి స్పీకర్ లేదా ఛైర్మన్ కు నోటీసు ఇవ్వాలి. వారు దీనిని అనుమతించవచ్చు లేదా తిరస్కరించవచ్చు.
2. సభాధ్యక్షులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి మరియు ఒక సుప్రసిద్ధ న్యాయ శాస్త్రజ్ఞుడు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమిస్తారు.
3. అభియోగాలు ఋజువు అయినట్లు తేలితే తొలగించే తీర్మానాన్ని ఉభయసభలు వేర్వేరుగా ప్రత్యేక మెజారిటీ (హాజరై ఓటు వేసిన వారిలో 2/3 వంతు) మరియు మొత్తం సభ్యుల్లో సాధారణ మెజారిటీకి తగ్గకుండా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ తీర్మానం మేరకు జడ్జీలను తొలగిస్తూ రాష్ట్రపతి ఆదేశాన్ని జారీ చేస్తారు.

1991-1993 మధ్య కాలంలో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వి. రామస్వామి పై అవినీతి కారణాలపై లోక్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. కానీ అది వీగిపోయింది.

అధికారాలు – విధులు :

ఎ) ప్రాధమిక అధికార పరిధి :

131వ ప్రకరణ ప్రకారం సుప్రీం కోర్టు సమాఖ్య స్వభావాన్ని తెలియజేస్తుంది. సమాఖ్య వివాదాలన్నింటిని సుప్రీంకోర్టులోనే పరిష్కరించుకోవాలి.

ఉదా : 1. కేంద్ర, రాష్ట్ర వివాదాలు

2. అంతర రాష్ట్ర వివాదాలు

3. ప్రాధమిక హక్కుల పరిరక్షణ

4. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వివాదం

## బి) అప్పీళ్ళ విచారణ పరిధి :

హైకోర్టు చెప్పిన తీర్పులతో రాజ్యాంగాన్ని మరింత లోతుగా వ్యాఖ్యానించవలసిన అవసరం ఉందని హైకోర్టు భావిస్తే అలాంటి కేసులను సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. సివిల్, క్రిమినల్ వివాదాలలో అప్పీళ్ళు, సుప్రీం కోర్టు ప్రత్యేక అనుమతితో అప్పీలు చేసుకోవచ్చు.

## సి) సలహా పూర్వక విచారణ పరిధి :

ప్రకరణ 143 ప్రకారం రాష్ట్రపతి రాజ్యాంగ విషయాలలో సుప్రీంకోర్టును సలహా అడుగుతారు. సుప్రీంకోర్టు వ్యక్తీకరించిన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు. ఇంతవరకు 14 అంశాలకు సంబంధించిన వివాదాలలో సుప్రీంకోర్టు సలహాను కోరడమైనది.

ఉదా : డిల్లీ న్యాయచట్టాలు -1951

కేరళ విద్యా బిల్లు -1958

లాభదాయక పదవులు -2006

## డి) కోర్ట్ ఆఫ్ రికార్డు :

సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులు, ప్రక్రియలు దేశవ్యాప్తంగా అన్ని దిగువ న్యాయస్థానాలలో సాక్షాలుగా, ఆధారాలుగా స్వీకరించాలి. దిగువ కోర్టులు ఆ తీర్పులనే ప్రామాణికాలుగా తీసుకుని తీర్పులు చెప్పాలి. దేశంలోని వ్యక్తులు, సంస్థలు సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలి.

### ఇ) రిట్లు జారీ చేసే అధికారం :

ప్రకరణ 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, ప్రకరణ 226 ప్రకారం హైకోర్టుకు ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం రిట్లు జారీ చేసే అధికారం ఉంది. హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరరి, కోవారెంటో రిట్లు జారీ చేస్తారు.

### ఎఫ్) న్యాయ సమీక్షాధికారం :

శాసన సభలు, ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలను, చట్టాలను, వాటి రాజ్యాంగ బద్ధతను పరిశీలించి అవి రాజ్యాంగ విరుద్ధమైతే చెల్లుబాటు కాకుండా తీర్పు చెబుతుంది. ప్రాథమిక హక్కుల పరిరక్షణ, సమాఖ్య వివాదాల పరిష్కారం, రాజ్యాంగ ఆధిక్యతను పరిరక్షించడానికి న్యాయ శాఖ స్వతంత్ర ప్రతిపత్తికి న్యాయ సమీక్ష దోహదం చేస్తుంది.

### చారిత్రక వివాదాలు :

1. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వైద్య కళాశాల్లో కొన్ని కులాలకు రిజర్వేషన్ల కోసం చేసిన చట్టాలను హైకోర్టు కొట్టిపేస్తే దానిని సుప్రీం కోర్టు సమర్థించింది. కొన్ని కులాలకు సాయం చేసే ఉద్దేశంతో ఇతర కులాలకు అన్యాయం జరగకుండా చూడాలని పేర్కొంది.
2. 1952లో శంకరీ ప్రసాద్ వివాదం, 1965లో సజ్జన్ సింగ్ వివాదంలో పార్లమెంట్ కు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని తద్వారా జమీందారీ, జాగీర్ధారీ విధానాలను రద్దు చేసి పార్లమెంటరీ అధికారాన్ని కోర్టు సమర్థించింది.
3. 1967లో గోలక్ నాధ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్ వివాదంలో ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ఆధ్వర్యంలో పార్లమెంట్ కు రాజ్యాంగాన్ని సవరించే అధికారం లేదని పేర్కొంది.
4. 1973లో కేశవానంద భారతి Vs కేరళ వివాదంలో గోలక్ నాధ్ వివాదంలో ఇచ్చిన తీర్పును మార్చి పార్లమెంట్ కు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని, అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చరాదని 13 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది.

5. 1980లో మినర్వా మిల్స్ వివాదంలో 42వ రాజ్యాంగ సవరణ సుప్రీం కోర్టు పరిశీలనకు వచ్చినపుడు రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని మరలా నొక్కి చెప్పి, రాజ్యాంగం సవరించడానికి పార్లమెంటు కు పరిమిత అధికారం ఉందని స్పష్టం చేసింది.

ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి :- జస్టిస్ ఎన్. వి. రమణ

# ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL)

భారతీయ చట్టంలో ప్రజా ప్రయోజనాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన వ్యాజ్యాన్ని PIL (Public Interest Litigation) అంటారు. నష్టపడిన పక్షం కాకుండా న్యాయస్థానమే స్వయంగా గానీ, మూడో పక్షం (వ్యక్తి) కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుంది. 1980 కి ముందు బాధిత పక్షం మాత్రమే న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించేది. 1980 తరువాత సుప్రీం కోర్టు ప్రజలకు మరింత చేరువ కావాలని పిల్ అనే వినూత్న మార్గాన్ని పరిచయం చేసింది.

స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు కొన్ని వందల సంఖ్యలో పిల్స్ సుప్రీం కోర్టు, హైకోర్టు దృష్టికి తీసుకువచ్చి ఎన్నో సమస్యలకు పరిష్కారం కనుగొన్నారు.
ఉదా : బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, స్త్రీల హక్కులు.
పిల్ స్వీకరించిన మొదటి న్యాయమూర్తులు : పి. ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణ అయ్యర్

# రాష్ట్ర హైకోర్టు (6వ భాగం 214-231 ప్రకరణలు)

హైకోర్టు రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం. 214 ప్రకరణ ప్రకారం ప్రతీ రాష్ట్రంలో ఒక హైకోర్టు ఉంటుంది. 231 ప్రకరణ ప్రకారం 2 లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంట్ ఒక చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేస్తుంది.

ఉదా : 1.మహారాష్ట్ర , గోవా 2. హరియాణ, పంజాబ్

- ప్రస్తుతం దేశంలో 25 హైకోర్టులు ఉన్నాయి.

## నిర్మాణం :

216 ప్రకరణ ప్రకారం హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. రాష్ట్రపతి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఆయా రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను, ఆ రాష్ట్ర గవర్నర్ ను సంప్రదించి హైకోర్టు న్యాయమూర్తులను నియమిస్తారు.

## అర్హతలు :

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. 62 సంవత్సరాలు నిండి ఉండరాదు.
3. ఏదైనా హైకోర్టులో 10 సంవత్సరాలకు తక్కువ కాకుండా న్యాయవాదిగా అనుభవం ఉండాలి. లేదా కేంద్ర, రాష్ట్ర న్యాయసర్వీస్ లో కనీసం 10 సంవత్సరాలు న్యాయాధికారిగా అనుభవం ఉండాలి.

## అధికారాలు – విధులు

### 1. ప్రారంభ అధికారం :

225 ప్రకరణ ప్రకారం కొన్ని వివాదాలను నేరుగా హైకోర్టులోనే పరిష్కరించుకోవాలి. ఉదాహరణకు రాష్ట్ర శాసన సభ్యుల ఎన్నిక వివాదము, పార్లమెంట్ సభ్యుల ఎన్నిక వివాదం,

ప్రాథమిక హక్కుల రక్షణ, కంపెనీ చట్టాలు, కాపీ రైట్ చట్టాలు, వీలునామా, కోర్టు ధిక్కారము మొదలైనవి.

## 2. అప్పీళ్ళ అధికార పరిధి :

రాష్ట్రంలో హైకోర్టు అప్పీళ్లకు సంబంధించిన అత్యున్నత కోర్టు. సివిల్, క్రిమినల్ కేసుల్లో క్రింది కోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.

## 3. రిట్లు-అధికార పరిధి :

226 ప్రకరణ ప్రకారం హెబియస్ కార్పస్, మాండమస్, ప్రోహిబిషన్, సెర్షియోరరి, కోవారెంటో రిట్లు జారీ చేసి ప్రాథమిక హక్కులను రక్షిస్తుంది.

## 4. కోర్ట్ ఆఫ్ రికార్డ్ :

215 ప్రకరణ ప్రకారం రాష్ట్రంలో హైకోర్టు కోర్ట్ ఆఫ్ రికార్డ్ గా వ్యవహరిస్తుంది. హైకోర్టు తీర్పులను రాష్ట్రంలోని అన్నీ దిగువ న్యాయస్థానాలు, వ్యక్తులు, సంస్థలు గౌరవించాలి. ఈ తీర్పుల ప్రకారం దిగువ కోర్టులు తీర్పులు చెప్పాలి.

## 5. న్యాయ సమీక్షాధికారం :

కేంద్ర, రాష్ట్రాల చట్టాల యొక్క రాజ్యాంగబద్ధతను పరిశీలించి, అవి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమయితే ఆ చట్టాలను హైకోర్టు సమీక్షిస్తుంది.

* ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి: జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా
* తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి : జస్టిస్ సతీష్ చంద్ర శర్మ

# అత్యవసర అధికారాలు

# (18వ భాగం 352-360 అధికరణలు)

ఇవి 3 రకాలు

## I. జాతీయ అత్యవసర పరిస్థితి (352వ ప్రకరణ):

దీనిని 2 కారణాల వల్ల విధించవచ్చు.

ఎ) బాహ్య కారణాలు : విదేశీ దాడి, యుద్ధం మొదలైన కారణాల వల్ల దేశ సమగ్రతకు భంగం కలుగుతుందని రాష్ట్రపతి భావించినపుడు.

బి) అంతర్గత కారణాలు : దేశంలో అంతర్గత కల్లోలం ఏర్పడి తద్వారా దేశ ఐక్యతకు, సమగ్రతకు భంగం వాటిల్లుతుందని రాష్ట్రపతి భావించినపుడు.

రాష్ట్రపతి ఒకే సమయంలో అంతర్గత, బాహ్య కారణాల వల్ల అత్యవసర పరిస్థితి ప్రకటించవచ్చు.

విధానం :

1. రాష్ట్రపతి క్యాబినెట్ లిఖిత పూర్వక సలహా మేరకు అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారు.
2. రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితిని పార్లమెంట్ 30 రోజుల్లోగా ఆమోదించాలి. 6 నెలల వరకు అమలులో ఉంటుంది. తదుపరి ఎన్నిసార్లయినా పొడిగించవచ్చు.
3. రాష్ట్రపతి మరొక ఆదేశం ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితిని రద్దు చేయవచ్చు.

## జాతీయ అత్యవసర పరిస్థితి – పర్యవసానాలు :

1. కేంద్ర కార్యనిర్వాహక వర్గం అధికారాలు విస్తృతం అవుతాయి.
2. కేంద్రం రాష్ట్రాలకు అన్ని అంశాలలో ఆదేశాలిస్తుంది.
3. రాష్ట్ర జాబితాలోని అన్ని అంశాలపై పార్లమెంట్ చట్టాలు చేయవచ్చు.
4. ఈ చట్టాలు అత్యవసర పరిస్థితి రద్దయిన తర్వాత కూడా 6 నెలలు అమలులో ఉంటాయి.
5. జాతీయ అత్యవసర పరిస్థితిలో లోక్ సభ, రాష్ట్ర శాసన సభల పదవీ కాలాన్ని ఒక సంవత్సరం వరకు పొడిగించవచ్చు. ఇలా ఎన్ని సార్లయిన చేయవచ్చు.

ఉదా : 1975 లో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నపుడు 5వ లోక్ సభ పదవీ కాలాన్ని ఒక సంవత్సరం పొడిగించారు.

6. 20, 21 అధికరణలలోని హక్కులు తప్ప మిగతా హక్కులన్నీ రద్దవుతాయి.

### జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాలు :

1. అక్టోబర్ 26, 1962 లో చైనా అరుణాచల్ ప్రదేశ్ పై దురాక్రమణ చేసినపుడు ప్రకటించారు. ఇది జనవరి 19, 1968 వరకు కొనసాగింది.

గమనిక : 1965 లో పాకిస్తాన్ యుద్ధ సమయంలో ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితి ప్రకటించవలసిన అవసరం రాలేదు.

2. పాకిస్తాన్ బంగ్లాదేశ్ పై దాడి చేసినపుడు 1971 డిసెంబర్ 3వ తేదీన జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. ఇది 1977 మార్చి వరకు కొనసాగింది.
3. అంతర్గత కారణాలవల్ల జూన్ 25, 1975 లో విధించారు. ఇది 1977 మార్చ్ వరకు కొనసాగింది.

గమనిక : 38 వ సవరణ ఒకేసారి రెండు కారణాలతో అత్యవసర పరిస్థితి విధించే అవకాశం కల్పించింది.

### II. రాజ్యాంగ పరమైన అత్యవసర పరిస్థితి / రాష్ట్రపతి పాలన:

ఎ) 355 ప్రకరణ ప్రకారం ప్రతీ రాష్ట్రం రాజ్యాంగపరంగా పరిపాలన కొనసాగించేలా చూడవలసిన భాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఏదైనా ఒక రాష్ట్రంలో రాజ్యాంగ పరమైన సంక్షోభం ఏర్పడినపుడు రాష్ట్ర గవర్నర్ నివేదిక మేరకు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్రపతి పాలన విధించవచ్చు.

బి) ప్రకరణ 365 ప్రకరణ ప్రకారం కేంద్ర ఆదేశాలను రాష్ట్రాలు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినపుడు కూడా విధించవచ్చు. పార్లమెంట్ రెండు నెలల లోపల సాధారణ మెజారిటీతో ఆమోదించాలి. లేకపోతే

2 నెలల తరువాత రద్దవుతుంది. 6 నెలల వరకు రాష్ట్రపతి పాలన కొనసాగుతుంది. మళ్ళీ పార్లమెంట్ ఆమోదిస్తే కొనసాగుతుంది.

ఉదా : పంజాబ్ లో రాష్ట్రపతి పాలన 5 సంవత్సరాలు కొనసాగించారు.

పర్యవసానాలు :

1. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేస్తారు లేదా సుప్త చేతనావస్థలో ఉంచుతారు. సుప్త చేతనావస్థలో ఉంచితే తిరిగి పునరుద్ధరించడానికి అవకాశం ఉంది.
2. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని అధికారాలు రాష్ట్రపతికి సంక్రమిస్తాయి.
3. రాష్ట్ర బడ్జెట్ ను పార్లమెంట్ ఆమోదిస్తుంది.
4. రాష్ట్రంలో పరిపాలన రాష్ట్రపతి పేరుతో గవర్నర్ కొనసాగిస్తాడు. గవర్నర్ తన విధుల నిర్వహణ లో సహాయాన్ని, సలహాలను అందించడానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు కొంతమంది సలహాదారులను నియమిస్తారు.

విధించిన సందర్భాలు:

1. రాష్ట్రపతి పాలన 120 పర్యాయాలకు పైగా విధించారు.
2. అత్యధిక సార్లు విధించబడిన రాష్ట్రాలు – ఉత్తర ప్రదేశ్, కేరళ
3. సుదీర్ఘ కాలం విధించబడిన రాష్ట్రం – పంజాబ్ (1987-1992)

III. ఆర్ధిక అత్యవసర పరిస్థితి:

360 ప్రకరణ ప్రకారం దేశ ఆర్ధిక పరిస్థితికి ప్రమాదం వాటిల్లుతుందని రాష్ట్రపతి భావిస్తే ఆర్ధిక అత్యవసర పరిస్థితి విధించవచ్చు. పార్లమెంట్ 2 నెలల లోపు ఆమోదించాలి. ఇప్పటివరకు ఆర్ధిక అత్యవసర పరిస్థితి విదించలేదు.

# రాజ్యాంగబద్ధ సంస్థలు

## కేంద్ర ఎన్నికల సంఘం (Election Commission of India)

## (15వ భాగం 324-329 ప్రకరణలు)

ఒక ప్రధాన ఎన్నికల కమీషనర్ మరియు ఇతర కమీషనర్లు రాష్ట్రపతి చేత నియమించబడతారు. పదవీకాలం 6 సంవత్సరాలు లేదా 65 సంవత్సరాలు వయసు వచ్చే వరకు ఉంటుంది. ప్రధాన ఎన్నికల కమీషనర్ ను పార్లమెంట్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే విధంగా తొలగిస్తుంది. ఇతర కమీషనర్లను ప్రధాన ఎన్నికల కమీషనర్ సలహా మేరకు అవినీతి, అసమర్ధత కారణాలతో రాష్ట్రపతి తొలగిస్తారు.

మొదటి ఎన్నికల కమీషనర్ : సుకుమార్ సేన్

ప్రస్తుత ఎన్నికల కమీషనర్ : సుశీల్ చంద్ర

అధికారాలు – విధులు :

1. పరిపాలనా పరమైన విధులు :

ఎ) ఓటర్ల జాబితాను రూపొందించడం, నిర్ణీత కాల వ్యవధిలో వాటికి సవరణలు చేయడం

బి) డీలిమిటేషన్ చట్టం ప్రకారం నియోజక వర్గాల భౌగోళిక పరిధిని నిర్ణయించడం

సి) ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం.

2. అర్థ న్యాయ సంబంధ విధులు :

ఎ) రాజకీయ పార్టీలను గుర్తిచడం, గుర్తులు కేటాయించడం.

బి) ఎన్నికల నియమావళి రూపొందించి అమలు చేయడం.

సి) ఎన్నికలలో జరిగిన అక్రమాల పరిశీలనకు విచారణ అధికారులను నియమించడం.

డి) పార్టీల మధ్య వచ్చే వివాదాలను విచారించి పార్టీల వాదనలను విని పరిష్కరిస్తుంది.

## ఆర్థిక సంఘం (Finance Commission)

## (12వ భాగం లో 280, 281 ప్రకరణలు )

కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల సక్రమ పంపిణీ కొరకు 280(1) ప్రకారం రాష్ట్రపతి ప్రతీ 5 సంవత్సరాలకు ఒక ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సంఘంలో ఒక చైర్మన్ ఉంటారు. ఈయనకు ప్రజా సంబంధ విషయాలలో పరిజ్ఞానం ఉండాలి. ఆర్థిక, న్యాయ,అకౌంటింగ్, విత్త పాలనలో అనుభవం ఉన్న నలుగురు సభ్యులు ఉంటారు. కేంద్రం నుండి రాష్ట్రాలకు మూడు విధాలైన ఆర్థిక వనరులు బదిలీ అవుతాయి. అవి

ఎ) పన్నుల పంపకం

బి) గ్రాంట్లు

సి) ఋణాలు

ఆర్థిక సంఘం నివేదికను రాష్ట్రపతి పార్లమెంట్ లో ఏదో ఒక సభలో ప్రవేశ పెట్టేలా చూస్తారు. సిఫారసులు అన్నింటిని లేదా కొన్నింటిని ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు.

మొదటి ఆర్థిక సంఘం చైర్మన్ : కె.సి.నియోగి

ప్రస్తుత (15వ) ఆర్థిక సంఘం చైర్మన్ : ఎన్. కె. సింగ్

# కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ - కాగ్ (148వ ప్రకరణ )

రాజ్యాంగ పరంగా అత్యున్నత పదవి. భారత ఖజానా సంరక్షకుడు. రాష్ట్రపతి తన రాజముద్ర చేత స్వయంగా సంతకం చేసిన ఆదేశము ద్వారా నియమిస్తాడు. పదవీ కాలం 6 సంవత్సరాలు, పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు. పదవీ విరమణ తరువాత ఇతర ప్రభుత్వ నియమకాలకు అర్హుడు కాదు.

## అధికారాలు – విధులు :

1. కేంద్ర, రాష్ట్ర సంఘటిత, ఆగంతుక, పబ్లిక్ నిధులను పరిశీలించి నివేదిక ఇస్తారు.
2. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల వ్యాపార లావాదేవీలను పరిశీలించి నివేదిక ఇస్తారు.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ఆదాయ, వ్యయాలకు సంబంధించిన నియమాలను, పద్ధతులను ఆడిట్ చేసి, సక్రమంగా ఉన్నాయో లేదో నివేదిక ఇస్తారు.
4. పార్లమెంటరీ ఆర్థిక కమిటీ అయిన పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ (PAC) కి తత్వవేత్తగా, స్నేహితుడిగా, మార్గదర్శిగా వ్యవహరిస్తాడు.

- మొదటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ : నరహరిరావు
- ప్రస్తుత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ : శ్రీ గిరీష్ చంద్ర ముర్ము

## అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా (76వ ప్రకరణ)

కేంద్రంలో అత్యున్నత న్యాయాధికారి. రాష్ట్రపతి చేత నియమించబడతారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి గా నియమించడానికి అవసరమైన అన్ని అర్హతలు ఉండాలి. పదవీకాలం రాష్ట్రపతి విశ్వాసం మీద ఆధారపడి ఉంటుంది.

విధులు :

1. కేంద్ర ప్రభుత్వానికి ముఖ్య న్యాయ సలహాదారు.
2. కేంద్ర ప్రభుత్వం తరుపున న్యాయస్థానంలో హాజరై వాదిస్తాడు.
3. రాష్ట్రపతి కోరిన ఇతర న్యాయపర అంశాలపై సలహాలు,సూచనలు చేస్తాడు.
4. పార్లమెంట్ శాసన కార్యక్రమాల్లో పాల్గొని తన వాదనను అభిప్రాయాలను చెప్పవచ్చు. ఓటు చేసే హక్కు ఉండదు.

- మొదటి అటార్నీ జనరల్ – ఎం.సి. సెతల్వాడ్
- ప్రస్తుత అటార్నీ జనరల్ – కె.కె. వేణుగోపాల్

# యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (14వ భాగం 315-323 ప్రకరణలు)

దేశంలో అత్యున్నత నియామక సంస్థ. 1919 బ్రిటీష్ ఇండియా చట్టంలో తొలిసారి ప్రస్తావన. 1926లో లీ కమీషన్ సిఫారసులతో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏర్పాటు చేశారు.

నిర్మాణం, పదవీకాలం :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్(యు.పి.ఎస్.సి.) లో ఒక చైర్మన్, రాష్ట్రపతి నిర్ణయించిన సంఖ్య లో (ప్రస్తుతం 10) సభ్యులు ఉంటారు. పదవీకాలం 6 సంవత్సరాలు, పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు.

తొలగింపు :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్(యు.పి.ఎస్.సి.) చైర్మన్ మరియు సభ్యులను అవినీతి, అసమర్ధత కారణంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత విచారణ చేయించి రాష్ట్రపతి తొలగిస్తారు.

విధులు :

- అఖిల భారత సర్వీస్ లకు, కేంద్ర సర్వీస్ లకు, కేంద్రపాలిత ప్రాంతాల సర్వీస్ లకు పోటీ పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.
- ప్రమోషన్లు, బదిలీలు, క్రమశిక్షణ చర్యలలో రాష్ట్రపతికి సలహాలు ఇస్తుంది.
- రాష్ట్ర గవర్నర్లు కోరితే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ విధులను కూడా నిర్వహిస్తుంది.
- ప్రస్తుతం కంబైన్డ్ డిఫెన్స్ నియమకాలను కూడా చేబడుతుంది.
- వార్షిక నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. సిఫారసులను పార్లమెంట్ ఆమోదించవచ్చు లేదా తిరస్కరిచవచ్చు. తిరస్కరిస్తే కారణాలు చెప్పాలి.
-

మొదటి యు.పి.ఎస్.సి. చైర్మన్ : హెచ్.కె. కృపలానీ

ప్రస్తుత యు.పి.ఎస్.సి. చైర్మన్ : ప్రదీప్ కుమార్ జోషి

## రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్

రాష్ట్రంలో అత్యున్నత నియామక సంస్థ. రాష్ట్ర సర్వీస్ లలో ( గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3,4) వివిధ ఉద్యోగాల నియమకాలకు పోటీ పరీక్షలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఎ.పి.పి.ఎస్.సి చైర్మన్ మరియు సభ్యులను గవర్నర్ నియమిస్తారు. పదవీకాలం 6 సంవత్సరాలు, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు.

ప్రస్తుత ఎ.పి.పి.ఎస్.సి. చైర్మన్ : దామోదర్ గౌతమ్ సవాంగ్

## జాతీయ షెడ్యూల్డ్ కులాల/ షెడ్యూల్డ్ తెగల కమీషన్

దేశంలోని షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల స్థితిగతులను పరిశీలించడానికి రాజ్యాంగపరంగా, చట్టపరంగా ఈ వర్గాలకు కల్పించిన రక్షణలు, అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను సమీక్షించి తగిన సూచనలు, సిఫారసులు చేయడానికి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో కమీషన్లు ఏర్పాటు చేశారు. 2003లో 89వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్.సి. , ఎస్.టి. లకు వేర్వేరు కమీషన్లు ఏర్పాటు చేశారు.

| | |
|---|---|
| షెడ్యూలు కులాల కమీషన్ | 338 వ ప్రకరణ |
| షెడ్యూలు తె ల కమీషన్ | 338(A) వ ప్రకరణ |

### నిర్మాణం :

కమీషన్ లో ఒక చైర్మన్, వైస్ చైర్మన్, ముగ్గురు సభ్యులు ఉంటారు. రాష్ట్రపతి నియమిస్తారు. పదవీకాలం 3 సంవత్సరాలు. తొలగించే అధికారం రాష్ట్రపతికే ఉంది. చైర్మన్ క్యాబినెట్ మంత్రి, వైస్ చైర్మన్ స్టేట్ మంత్రి, సభ్యులు డిప్యూటీ మంత్రుల హోదాను కలిగి ఉంటారు.

ప్రస్తుత ఎస్.సి కమీషన్ ఛైర్మన్ : శ్రీ విజయ సంపాల

ప్రస్తుత ఎస్.టి కమీషన్ ఛైర్మన్ : రామేశ్వర్ ఓరాన్

విధులు :

1. రాజ్యాంగపరంగా, చట్టపరంగా షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి కల్పించిన రక్షణలు, సదుపాయాలు ఏవిధంగా అమలు జరుగుతున్నాయో పర్యవేక్షించడం.
2. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను విచారిచడం.
3. వారి ఆర్థిక, సాంఘిక అభివృద్ధి కోసం రూపొందించే ప్రణాళికల రూపకల్పనలో తగిన సలహాలు ఇవ్వడం.

అధికారాలు :

1. సంబంధిత వ్యక్తులకు కమీషన్ ముందు హాజరవ్వాలని సమన్లు జారీ చేయడం.
2. సంబంధిత పత్రాలను సమర్పించమని ఉత్తర్వులు జారీ చేయడం.
3. ఏదైనా న్యాయస్థానం లేదా కార్యాలయాల నుంచి అవసరమైన సమాచారాన్ని కోరడం.
4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కు సంబధించిన కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకొనేటపుడు కమీషన్ ను తప్పనిసరిగా సంప్రదించాలి.

# రాజ్యాంగ సవరణ పద్ధతి
# (20వ భాగం 368వ ప్రకరణ)

కాలానుగుణంగా దేశ ప్రజల అవసరాల కోసం రాజ్యాంగాన్ని సవరించే అవకాశం రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంట్ ఇచ్చారు. రాజ్యాంగాన్ని సవరించడానికి 3 పద్ధతులను అనుసరిస్తారు.

## I. సాధారణ మెజారిటీ పద్ధతి:

హాజరై ఓటు వేసిన వారిలో సగాని కంటే ఎక్కువ ఉండాలి. ఇది రాజ్యాంగ సవరణగా పరిగణించరాదు. ఈ పద్ధతి ద్వారా సవరించబడే అంశాలు.

ఎ) కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడం, రాష్ట్ర సరిహద్దుల మార్పు, రాష్ట్రాల పేర్లు మార్పు చేయడం. (1-4)
బి) రాష్ట్ర విధాన పరిషత్ ఏర్పాటు, రద్దు (169)
సి) భారత పౌరసత్వం లో మార్పులు (5-11)
డి) పార్లమెంట్ లో కోరం(100)
ఇ) పార్లమెంట్ లో శాసన నిర్మాణ ప్రక్రియలు, శాసన సభ్యుల సాధికారాలు
ఎఫ్) నియోజక వర్గాల పునర్విభజన

## II. ప్రత్యేక మెజారిటీ పద్ధతి:

368 ప్రకరణ ప్రకారం హాజరై ఓటు వేసిన వారిలో 2/3 వంతు మెజారిటీ సాధించాలి.

ఎ) ప్రాథమిక హక్కులు (12-35)

బి) ఆదేశ సూత్రాలు (36-51)

సి) మిగతా రెండు పద్ధతుల్లో పేర్కొనబడని అంశాలు

## III. ప్రత్యేక మెజారిటీ మరియు రాష్ట్ర శాసన సభల ఆమోదం:

పార్లమెంట్ ప్రత్యేక మెజారిటీతో ఆమోదించిన తరువాత సగానికి తగ్గకుండా రాష్ట్రాలు సాధారణ మెజారిటీతో ఆమోదించాల్సి ఉంటుంది.

ఎ) రాష్ట్రపతి ఎన్నిక విధానం (54, 55)

బి) కేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక పరిధి విస్తృతి (73, 162)

సి) రాష్ట్రాలకు పార్లమెంట్ లో ప్రాతినిధ్యం (80, 81)

డి) ఏడవ షెడ్యూల్ (కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన)

ఇ) రాజ్యాంగ సవరణ పద్ధతి (368)

# ముఖ్యమైన రాజ్యాంగ సవరణలు

1వ రాజ్యాంగ  సరరణ  – 1951 :

భూసంస్కరణలు, ఇతర చట్టాలను రక్షించుకొనేందుకు 9వ షెడ్యూల్ ను చేర్చారు.  ఈ షెడ్యూల్ లో చేర్చిన అంశాలు కోర్టుల న్యాయసమీక్ష పరిధిలోకి రావు.

7వ రాజ్యాంగ సరరణ  – 1956 :

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ సిఫారసుల ఆధారంగా చేసిన రాష్ట్రాల A,B,C,D వర్గీకరణను తొలగించారు. వాటిని పునర్వ్యవస్థీకరిస్తూ 14 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు.

15వ రాజ్యాంగ సరరణ – 1963 :

హైకోర్టుకు ఉన్న రిట్లు జారీ చేసే అధికార పరిధిని విస్తృత పరిచారు. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 60 నుండి 62కు పెంచారు.

24వ రాజ్యాంగ సరరణ – 1971 :

దీని ద్వారా రాజ్యాంగం లోని ప్రాధమిక హక్కులతో పాటు ఏ భాగాన్నైనా సవరించే హక్కు పార్లమెంట్ కు కలిగింది.

38వ రాజ్యాంగ సరరణ – 1975 :

1. రాష్ట్రపతి విధించిన అత్యవసర పరిస్థితిని కోర్టుల అధికార పరిధి నుంచి మినహాయించారు.
2. రాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్లు జారీ చేసిన ఆర్డినెన్స్ లు కోర్టు అధికార పరిధి లోకి రాకుండా సవరించారు.
3. భిన్న ప్రాతిపదికలపై వివిధ రకాల జాతీయ అత్యవసర పరిస్థితులను ఏక కాలంలో ప్రకటించే అధికారం రాష్ట్రపతికి కల్పించారు.

42వ రాజ్యాంగ సరరణ – 1976 :

1. దీనిని మినీ రాజ్యాంగం అంటారు. స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల అమలుకై ఈ సవరణలు చేశారు.
2. ప్రవేశిక కు సామ్యవాద, లౌకిక మరియు సమగ్రత అనే మూడు పదాలు చేర్చారు.
3. ప్రాధమిక విధులను IV-A భాగంలో చేర్చారు.
4. మంత్రివర్గం సలహా మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలి.
5. రాజ్యాంగ సవరణలను ఏ న్యాయస్థానం ప్రశ్నించకూడదు.
6. లోక్ సభ, రాష్ట్ర శాసన సభల పదవీకాలాన్ని 5 సంవత్సరాల నుండి 6 సంవత్సరాలకు పెంచారు.
7. రాష్ట్ర జాబితాలోని ఐదు అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు. అవి:

   ఎ) అడవుల పరిరక్షణ

   బి) విద్య

   సి) తూనికలు- కొలతలు

   డి) ఖడ్గ మృగాలు మరియు పక్షుల సంరక్షణ

   ఇ) న్యాయపాలన మరియు సుప్రీం కోర్టు మినహా మిగిలిన కోర్టుల ఏర్పాటు మరియు వ్యవస్థీకరణ

44వ రాజ్యాంగ సరరణ – 1978 :

1. ఆరు సంవత్సరాలకు పెంచిన లోక్ సభ, రాష్ట్ర విధాన సభల కాలపరిమితిని 5 సంవత్సరాలకు తగ్గించింది.
2. 42 వ సవరణ చట్టంలోని వక్రతలైన కోర్టుల అధికార పరిధి తగ్గించడం, పార్లమెంట్, మంత్రి మండలికి కల్పించిన విశేషాధికారాలు సరిచేసింది.

73వ రాజ్యాంగ సరరణ – 1992 :

పంచాయితీ సంస్థలకు రాజ్యాంగ హోదాను, భద్రతను కల్పించారు.

74వ రాజ్యాంగ సరరణ – 1992 :

పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను, భద్రతను కల్పించారు.

86వ రాజ్యాంగ సరరణ – 2001:

1. ప్రాధమిక విద్యను ప్రాధమిక హక్కుగా అవకాశం కల్పించారు. 21A ప్రకారం 6-14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత, నిర్భంద ప్రాధమిక విద్యను అందించాలి.
2. ఆదేశ సూత్రాలలో 45వ ప్రకరణ మార్చారు. 6 సంవత్సరాల లోపు బాల,బాలికల బాల్యాన్ని రక్షిస్తూ విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.
3. ప్రకరణ 51A లో కొత్త ప్రాధమిక విధిని చేర్చారు. 6-14 సంవత్సరాల లోపు పిల్లలకు చదువు కొరకు వసతులు కల్పించడం తల్లి దండ్రులు / సంరక్షకుల విధి.

101వ రాజ్యాంగ సరరణ – 2016 :

వస్తు, సేవల పన్ను (GST) కు చట్ట బద్ధత కల్పించారు. ఇది 2017, జులై 1 నుండి అమలులోకి వచ్చింది.

102వ రాజ్యాంగ సరరణ – 2018 :

వెనుకబడిన వర్గాలకు జాతీయ కమీషన్ ఏర్పాటు చేశారు.

103వ రాజ్యాంగ సరరణ – 2019 :

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (EWS) 10% రిజర్వేషన్స్ కల్పిస్తూ చట్టం చేయబడింది.

---

ఈ క్రింది పుస్తకాల నుండి పై విషయాలు సేకరించడమైనది.

1. భారత రాజ్యాంగం - తెలుగు అకాడమీ
2. భారత రాజకీయ వ్యవస్థ - ఎం. లక్ష్మీ కాంత్ ( ఆంగ్ల భాష లోని 4వ ప్రచురణకు తెలుగు అనువాదం)
3. 8 నుంచి 10 తరగతుల సాంఘిక శాస్త్రం టెక్స్ట పుస్తకాలు

...బస్వా వెంకట కృష్ణ, క్రియ సభ్యులు